**విలేకరులు కావలెను**

**మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189

TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA



హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల శుక్రవారం 30 ఆగస్టు 2024 పేజీలు : 4 వేల : 2.00

## ఆన్ లైన్ పాస్ పోర్ట్ పోర్టల్ మూసివేత

## మెయింటెనెన్స్ లో భాగంగానే ఈ నిర్ణయం




**మన వార్త** ఆన్లైన్ పాస్ పోర్ట్ పోర్టల్ మూతపడింది. పాస్ పోర్ట్ కోసం అప్లై చేసుకునే ఆన్లైన్ పోర్టల్ ఇవాళ ( ఆగస్టు 29, 2024 ) రాత్రి 8గంటల నుండి 5 రోజుల పాటు మూసివేయనున్నట్లు తెలిపింది ప్రభుత్వం. ఈ ఐదు రోజుల వ్యవధిలో ( సెప్టెంబర్ 2 వరకు ) కొత్త అపాయింట్మెంట్స్ స్వీకరించబడవని తెలిపింది. ముందుగా బుక్ చేసుకున్న అపాయింట్మెంట్స్ రీషెడ్యూల్ చేయబడతాయని, మెయింటెనెన్స్ లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది ప్రభుత్వం. ఈ క్రమంలో పోర్టల్ నకిలీ వెబ్సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది ప్రభుత్వం. చాలా నకిలీ వెబ్సైట్‌లు, మొబైల్ అప్లికేషన్‌లు దరఖాస్తుదారుల నుండి డేటాను సేకరిస్తున్నాయని, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ నింపడానికి, పాస్‌పోర్ట్ మరియు సంబంధిత సేవల కోసం అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేయడానికి అదనపు భారీ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. నకిలీ వెబ్సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పాస్ పోర్ట్ అప్లై చేయటం కొసం ఎక్కడా పేమెంట్స్ చేయద్దని సూచించింది. దరఖాస్తు కోసం భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.passportindia.gov.in ద్వారా మాత్రమే అప్లై చేసుకోవాలని తెలిపింది.

## నేరాలను కట్టడి చేయాలంటే తప్పు జరిగిన వెంటనే శిక్షపడాలి...




**మన వార్త** ప్రస్తుతం హైడ్రాపై ఎలా చర్చ జరుగుతుందో.. మహిళల భద్రతపై అంతలా చర్చ జరగాలన్నారు మంత్రి సీతక్క. నేరాలను కట్టడి చేయాలంటే తప్పు జరిగిన వెంటనే శిక్ష పడాలన్నారు. నేరాలు జరగకుండా ఆలోచనలు సక్రమంగా ఉండాలంటే తరగతి గదుల నుంచే విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలన్నారు సీతక్క. మాదక ద్రవ్యాల ప్రభావం హత్యలకు కారణం అవుతోందన్నారు సీతక్క. పని ప్రదేశాల్లో మహిళలు క్షేమంగా ఉండాలని చెప్పారు. కోల్ కతా మహిళా డాక్టర్ ఘటన యావత్ దేశాన్ని కుదిపేసిందన్నారు. ఎక్కడైనా ఎవరిపైనా ఏ ఘటన జరిగినా ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలన్నారు. విమెన్ సేఫ్టీ వింగ్ తో కొన్ని సమావేశాలు ఏర్పాటు చేసి నేరాల కంట్రోల్ కు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠ్య పుస్తకాల్లో చట్టాల గురించి తెలియజేసేలా కృషి చేస్తామన్నారు సీతక్క.

## స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధం...

# కలెక్టర్లకు కీలక ఆదేశాలు...




**మన వార్త** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ జాబితా, పోలింగ్ బూత్?ల ఏర్పాటుతో పాటు ఇతర అంశాలపై చర్చించారు. రానున్న నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేసేందుకు అందరూ సమాయత్తం కావాలని ఈ సందర్భంగా కలెక్టర్లను కమిషనర్ ఆదేశించారు. కాగా, మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మొదట సర్పంచ్, తర్వాత జెడ్పీ, ఎంపీటీసీ ఆ తర్వాత మునిసిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 6వ తేదీన ఎన్నికల షెడ్యూల్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్, 21వ తేదీన ఫైనల్ ఓటర్ లిస్ట్?ను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 ఓటర్లు.. 650 ఓట్లు దాటితే అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈసీ డిసైడ్ అయ్యింది. లోకల్ బాడీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టడంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఎన్నికలకు సిద్ధం అవుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు దక్కించుకోవాలని వ్యూహాలు మొదలుపెట్టగా.. బీఆర్ఎస్, బీజేపీ లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి.

## పేదలకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి

# ఈటెల రాజేంద్ర ఫైర్




**మన వార్త** హైదరాబాద్ నగరంలో గత నెల రోజులుగా అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. దీంతో పలువురు నాయకులు హైడ్రా కు మద్దతుగా నిలుస్తుండగా..పలువురు నేతలు మాత్రం అమాయక ప్రజలకు నోటీసులు ఇచ్చి.. సమయం ఇవ్వకుండానే కూలగొడుతున్నారని.. ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్ అయ్యారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఈటల పేదల ఇళ్ల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని.. వార్నింగ్ ఇచ్చారు. చెరువుల్లో పట్టా భూములు ఉంటే పేద ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించాలని అన్నారు. అలాగే పేదలకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని.. లేదంటే సీఎం రేవంత్ సంగతి చూస్తామని ఎంపీ ఈటల చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌లోని మాదాపూర్, దుర్గం చేరువును ఆనుకోని ఉన్న అమర్ కో–ఆపరేటివ్ సొసైటీలో తిరుపతిరెడ్డి ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. కాగా ఆ ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఈ నోటీసులు ఇచ్చారు. అలాగే దుర్గం చెరువును అనుకుని ఉన్న కావూరి హిల్స్, సెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, అమర్ సొసైటీ వాసులకు కూడా హైడ్రా నోటీసులు జారీ చేసింది. అలాగే నెల రోజుల్లో అక్రమ కట్టడాలు అన్ని కూల్చేయాలని నోటీసుల్లో తెలిపింది.

మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA

## హైడ్రా అధికారులు నోటీసులపై స్పందించిన

## సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు...



సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఉంటున్న ఇంటికి గురువారం హైడ్రా అధికారులు నోటీసులు అంటించారు. కాగా విషయంపై తిరుపతి రెడ్డి స్పందించారు. తాను 2015లో అమర్ సొసైటీ లో ఇంటిని కొనుగోలు చేశాను. ఆ సమయంలో తాను కొన్న ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందనే సమాచారం తెలియదని చెప్పుకొచ్చారు. అలాగే తాను ఉంటున్న నివాసం.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే ప్రభుత్వం, హైడ్రా ఎటువంటి చర్యలు తీసుకున్న తనకు అభ్యంతరం లేదని సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి చెప్పుకొచ్చారు. కాగా దుర్గం చెరువును అనుకుని ఉన్న కావూరి హిల్స్, సెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, అమర్ సొసైటీ వాసులకు కూడా హైడ్రా నోటీసులు జారీ చేసింది. అలాగే నెల రోజుల్లో అక్రమ కట్టడాలు అన్ని కూల్చేయాలని నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు...

**మన వార్త** హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు కీలక వ్యాఖ్యల నేపథ్యంలో సీఎస్ శాంతి కుమారి రాష్ట్ర సచివాయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో హైడ్రా, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు. న్యాయపరమైన సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమీక్షలో చర్చిస్తున్నారు. కాగా, చెరువులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాల్లో ఆక్రమలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హైడ్రా పేరు వింటే కొందరి గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. తమ భవనాలను ఎక్కడ కూల్చివేస్తారోననే భయంతో కోర్టులను ఆశ్రయిస్తున్నారు. తాజాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సహా పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం నిబంధనల ప్రకారమే ముందుకెళ్లాలని హైడ్రా, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో క్రమంలోనే ఇవాళ సీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతేకాదు.. ఈ భేటీలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు సైతం హాజరయ్యారు.





చెట్టును నాటుదాం... పర్యావరణాన్ని రక్షిద్దాం...

# ఏఐటీయూసీ మండల నూతన కమిటీ ఎన్నిక



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాఆగస్టు 28 (మన వార్త ప్రతినిధి)**
సుజాతనగర్ ఏఐటీయూసీ మండల అధ్యక్షులుగా వీర్ల మల్లేష్ ప్రధాన కార్యదర్శిగా కుమారి హనుమంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారుబుధవారం సుజాతనగర్ మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్లో ఏఐటీయూసీ ద్వితీయ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు ఎస్కే షాబీర్ పాషా జిల్లా అధ్యక్షులు కంచర్ల జమ్మలయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారుగౌరవ సలహాదారులుగా నీలకంఠం నారాయణ గౌరవ అధ్యక్షులుగా దండు నాగేశ్వరరావువర్కింగ్ ప్రెసిడెంట్ గా బొడ్డు కేశవరావుసహాయ కార్యదర్శిగా వీర్ల దుర్గాప్రసాద్‌రావిశెట్టిలక్ష్మయ్యమండేఅరుణకూరపాటిలక్ష్మణ్‌ఉపాధ్యక్షులుగాకళావతినాగేశ్వరరావు బివీరమ్మఆర్గనైజింగ్ కార్యదర్శిగామేకల వెంకటేష్దండు సురేష్యాదగిరిట్రెజరర్గరుగులా సత్యనారాయణవీరిని నూతన కమిటీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు39 మంది కౌన్సిల్ సభ్యులుగా 19 మంది కార్యవర్గం సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందిఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతూ ప్రజా సమస్యలను పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి రైతులకు కార్మికులకు సమస్యలను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు

# ఆక్రమణలకు కళ్లెం- దూకుడు పెంచిన హైడ్రా



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 29( మన వార్తా ప్రతినిధి )**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హైదరాబాద్‌లోని దుర్గంచెరువు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఫోకస్ చేశారు. దుర్గంచెరువును ఆనుకుని పలువురు ప్రముఖుల ఖరీదైన భవనాలు నిర్మించినట్లు, అవన్నీ ఎఫ్‌టీఎల్ జోన్‌లో పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో గురువారం ఉదయం దాదాపు 204 మందికి శేర్లింగంపల్లి తాసిల్దార్ నోటీసులు పంపారు 30 రోజుల్లో గా ఎవరికి వారే నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాలు అన్ని స్వచ్ఛందంగా కూల్చివేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు లేకపోతే తామే రంగంలోకి దిగి కూల్చి వేస్తామని అధికారులు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు ఇదిలా ఉండగా నోటీసులు అందుకున్న వారిలో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి కూడా ఉన్నట్టు సమాచారం ఎఫ్ టి ఎల్ జోన్ లోనే అద్దెకు ఉంటున్న తిరుపతిరెడ్డి ఇంటికి ఈ ఉదయం అధికారులు నోటీసులు జారీ చేశారు నెక్లర్ కాలనీ డాక్టర్స్ కాలనీ కావూరి హిల్స్ అమర్ కో-ఆపరేటివ్ సొసైటీ లోని నివాసాలకు నోటీసులు అందజేశారు కాగా రాష్ట్రంలో హైడ్రా దూకుడు కొందరికి కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది చెరువులు నాళాల ఆక్రమణలకు పాల్పడి అనుమతులు లేకుండా భవనాలు నిర్మించిన వారి జాబితాలను ఇప్పటికే హైడ్రా సేకరించింది ఒక్కొక్కరిగా అందరి భరతం పడుతూ వస్తోంది ప్రస్తుతం హైటెక్ సిటీ లోని రాయదుర్గం మాదాపూర్ పరిధిలో ఉండే దుర్గం చెరువు చుట్టూ విలాసవంతమైన భవనాలు నిర్మించిన వారు హడలెత్తిపోతున్నారు దుర్గం చెరువులోని కాలనీలో మొత్తం 204 ఏళ్లకు జిహెచ్ఎంసి అధికారులు నోటీసులు జారీ చేశారు వీరిలో సినీ రాజకీయ ప్రముఖులు ఉన్నారు


## ప్రజల సమస్యలు పట్టించుకోని అధికారులు...

# వాహనదారులకు తప్పని తిప్పలు...



**వేములవాడ ఆగస్టు 29 ( మన వార్తా ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌరస్తా నుండి కోరుట్ల బస్టాండ్ వరకు వాహనదారులకు రోడ్లపై ఏర్పడిన గుంతలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులకు ప్రమాదం స్పందిస్తేనే అధికారులు స్పందించేటట్లు ఉన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ రోడ్డు వెంబడి నుండి స్కూల్ పిల్లల వాహనాలు మరియు అనేక రకాల వాహనాలు ఈ రోడ్డు వెంబడి నుండి వెళ్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు చోద్యం చూడకుండా రోడ్డుపై ఉన్న గుంతలు మరమ్మత్తులు చేయించగలరని ప్రజలు కోరుతున్నారు.

# సెప్టెంబర్ 1న జమ్మికుంటలో ఆర్యవైశ్య వనభోజన కార్యక్రమం...




**-రండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి...**
**జమ్మికుంట, ఆగస్టు 29( మన వార్త ప్రతినిధి):**
కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య వనభోజనాల కార్యక్రమం మరియు మండల కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాటు. జమ్మికుంట పట్టణంలోని స్థానిక కాటన్ మార్కెట్లో సెప్టెంబర్ 1న ఆదివారం రోజున ఉదయం 10:00 నుండి ఆర్యవైశ్య కుల బాంధవులకు శ్రావణమాస భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆర్యవైశ్య మహాసభ వారు తెలిపారు. అదేవిధంగా మండల కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆటపాటలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు పాల్గొని విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు...



**మంచిర్యాల్ ఆగస్ట్ 29 ( మన వార్త ప్రతినిధి)**
పట్టణంలోని పలురోడ్లపై ఉన్నటువంటి కల్వర్టులను రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారని ఈ ప్రమాదాలను అరికట్టేందుకే రేడియం స్టిక్కలను అంటిస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. గత రెండు రోజులుగా మందమర్రి గోదావరిఖని కోల్ బెల్ట్ రోడ్డుపై ఉన్నటువంటిట్ కల్వర్టులకు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు అతివేగంగా వచ్చి కలవాటులను ఢీకొనడం పరిపాటిగా మారిందని చెప్పారు. వాహనదారుల రక్షణ కోసమే ఇవి ఏర్పాటు చేశామని చెప్పారు. అంతేకాకుండా రోడ్లపై ఉన్నటువంటి డివైడర్లకు కూడా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాహనదారులు ఉదయం రాత్రి వేళల్లో ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపడం వారికే మంచిదని పేర్కొన్నారు. అతివేగం ప్రమాదాలకు తావిస్తుందని వాహనదారులు వారిపై కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారనే విషయాన్ని విస్మరించకుండా వాహనాలను నడపడం వారికి మంచిది అన్నారు.

# ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య..



**వేములవాడ, ఆగస్టు 29 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి వికృతి నవీన్ (27) వికృతి శేఖర్ లక్ష్మి ల కుమారుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని బలవన్ మరణానికి పాల్పడ్డాడు శేఖర్ లక్ష్మీ లకు ఒక్క కొడుకు కావడంతో వాళ్ల కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి ఎంతో గారాబంగా పెంచుకున్న కొడుకు ఇక లేడు అనే విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు కాగా కొద్ది రోజుల క్రితమే పెళ్లి సంబంధాలు చూస్తున్నారు ఈ సందర్భంలో కుమారుడు ఉరి వేసుకొని చనిపోవడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి ప్రేమ వ్యవహారం అయి ఉండవచ్చు అనే అనుమానాలు వస్తున్నాయి సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేపడుతున్నారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విద్యార్థులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పాక్సో యాక్ట్ లపై అవగాహన కలిగి ఉండాలి..




**-లైంగిక దాడులు అరికట్టడంలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ఎంతగానో ఉపయోగపడుతుంది,**
**-జిల్లాలో ఇప్పటి వరకు 65 పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు,**
**-వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,**
**వేములవాడ, ఆగస్టు 29 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోక్సో పై చైతన్య అవగాహన కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లి వద్ద గల నిర్మలా ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ,ఫోక్సో చట్టం గురించి,పోక్సో చట్టం ప్రకారం అమలులో ఉన్న శిక్షల గురించి,సోషల్ మీడియా,సైబర్ క్రైమ్ ల వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ. జిల్లా పోలీస్ శాఖ విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని,విద్యార్థులు జీవితంలో చక్కటి లక్ష్యాలను ఎన్నుకుని సరైన మార్గంలో శ్రమిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోలే తప్ప అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నరు. విద్యార్థిని విద్యార్థులకు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ "పోక్సో పై చైతన్యం" పేరుతో జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలో,కలశాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లాలో ఈ రోజు వరకు 65 పాఠశాలలు, కళాశాలలో పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మైనర్ బాలికలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని,తద్వారా తమ విలువైన జీవితం అంతా జైల్లోనే మగ్గిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిన్నారులు తమకు ఇంట్లో,పాఠశాలలో,వీధుల్లో పొరుగువారితో ఎదురయ్యే రకరకాల వేధింపులు, అసభ్య ప్రవర్తన,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ల గురించి నిర్భయంగా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని,తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.

# ఆత్మీయ సమ్మేళనం వన భోజనానికి మున్నూరు కాపులు తరలిరండి..



**-కరపత్రాలు ఆవిష్కరణ...**
**జమ్మికుంట, ఆగస్టు 29( మన వార్త ప్రతినిధి):**
మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం మరియు వనభోజనాల కార్యక్రమాల కరపత్రాలు ఆవిష్కరణ. స్థానిక దుబ్బ మల్లన్న దేవస్థానం పరిధిలో సెప్టెంబర్ 1 ఆదివారం న జరగబోయే మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం మరియు వనభోజన కార్యక్రమ కరపత్రాలను మున్నూరు కాపు కుల బాంధవులు దుబ్బ మల్లన్న దేవాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఈ సమ్మేళనానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ ప్రభుత్వ విప్పు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ లు రా ఉన్నట్లు తెలిపారు. మన మున్నూరు కాపుల ఆరాధ్య దైవమైన మల్లన్న దేవుని దగ్గర పెద్దపట్నం నిర్వహిస్తూ మున్నూరు కాపుల ఆటపాటలతో వివిధ సంస్కృత నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల మున్నూరు కాపుల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొనగంటి మల్లయ్య, పొనగంటి సంపత్, ఆకుల రాజయ్య, తోట లక్ష్మణ్, ఆకుల రాజేందర్, పురం శెట్టి చేరాలు, పుప్పాల రఘు, పొనగంటి రాము మున్సిపల్ కౌన్సిలర్, పుప్పాల రాజారం, ఏబూసి శ్రీనివాస్, పొనగంటి రవి పిజిఆర్, పొనగంటి విష్ణు, పొనగంటి ప్రభాకర్, ఆడవాళ్ళ శ్రీధర్, దాట్ల వీరస్వామి, దాట్ల శ్రీనివాస్, కాసర్ల అనిల్, గాండ్ల శ్రీనివాస్, ముష్క మల్ల తిరుపతి, ఉడుగుల మహేందర్, మేడిపల్లి ఓదెలు, గాజ హరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై హెల్త్ క్యాంపులు అవగాహన కార్యక్రమలు చేపట్టాలి



**-డిఎంహెచ్ఓ కి వినతి పత్రం అందజేసిన, లంబాడి ఐక్యవేదిక, భీమ్ ఆర్మీ....**
**వేములవాడ ఆగస్టు 29 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అనేక గ్రామాలలో డెంగ్యూ , విష జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న వేళ గ్రామాల్లో హెల్త్ క్యాంపులు మరియు ప్రజలకి వాటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా డిఎంహెచ్ఓ ,భీమ్ ఆర్మీ లంబాడి ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది ,ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్, లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు నరేష్ నాయక్ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ,విష జ్వరాలు వల్ల అనేక గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడి చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వారికి సరైన వైద్యం అందడం లేదని అన్నారు, అలాంటి వారికోసం ప్రతి గ్రామాల్లో హెల్త్ క్యాంపు నిర్వహించాలని కోరారు,అలాగే సీజనల్ కాలంలో వచ్చే వ్యాధులు విష జ్వరాలు గురించి ప్రజలకి పూర్తి స్థాయి అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు ,అలాగే ఈ విష జ్వారాల బారిన పడుతున్న ప్రజలను దృష్టిలో ఉంచుకొని ,జిల్లాలోని అనేక ప్రైవేట్ హాస్పిటల్స్ లేని పోని టెస్టులు చేస్తూ వేల రూపాయలు పిజులు వసూలు చేస్తూన్నారని అమాయక ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారు అని అన్నారు , ఈ దోపిడీని అరికట్టాలని ఈలాంటి చర్యలకు పాల్పడుతున్న ప్రైవేట్ హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గం అధ్యక్షులు మాసం సుమన్ ,బహుజన సేన అద్యక్షులు జింక శ్రీధర్, నగరాజ్, విజయ్ , ప్రణయ్ మధు, మహేష్,తదితరులు పాల్గొన్నారు

## మందమర్రి మున్సిపాలిటీ మెగా మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

# చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



**మంచిర్యాల్ ఆగస్ట్ 29 (మన వార్తా ప్రతినిధి)**
మందమర్రి మున్సిపాలిటీ మెగా మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని పాలకవర్గం లేని మున్సిపాలిటీలో ప్రజల సంక్షేమం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక వెంకటస్వామి తెలిపారు. గురువారం పట్టణంలోని 24వ వార్డు ఊరు మందమరి ఎర్రగుంట పల్లె తోపాటు పలు వార్డులలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చినటువంటి హామీలను నెరవేరుస్తానని తెలిపారు. ఊరు మందమర్రిలో రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలకు ఒక కోటి 50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వార్డులలో చెత్తాచెదారం నిలువ ఉండకుండా డ్రైనేజీలను కూడా శుభ్రం చేయాలని తెలిపారు. ప్రజలకు అధికారులు జవాబుదారీగా పని చేయాలని పేర్కొన్నారు. ప్రతినెల పన్నులు చెల్లించి ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందా అన్నారు. మున్సిపాలిటీలో పెండింగ్లో ఉన్నటువంటి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కూడా ఆదేశించారు. పట్టణంలోని ఎర్రగుంటపల్లి తో పాటు మామిడి కూడా ఒక మధ్యలో ఉన్నటువంటి వాగును పరిశీలించారు. ప్రజల ప్రయాణ సౌకర్యార్థం వాగుపై వంత నిర్మాణం చేయాలని దీనికి సంబంధించి పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ తో మాట్లాడి నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఇంజనీర్ అచ్యుతు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు ఐకెపి సిబ్బంది వినతి



**మంచిర్యాల్ ఆగస్టు 29 (మన వార్తా ప్రతినిధి )**
తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి గురువారం ఆర్కేపి ఆర్ కె పి సిబ్బంది వినతి పత్రం సమర్పించారు. వీరంతా కేతన పెల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ పార్వతి విజయ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం సమర్పించారు. తమకు పక్కా భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్వామి సంబంధిత అధికారులతో మాట్లాడి భవనంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు కౌన్సిలర్ పార్వతి విజయ ఎమ్మెల్యేకు పూల మొక్కను అందజేశారు.

## సంతాప సభలో పాల్గొన్న కొత్తగూడెం ఎమ్మెల్యే




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 29 (మన వార్తా ప్రతినిధి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అమరజీవి దొడ్డ సక్కుబాయమ్మ సంతాప సభలో ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ దొడ్డ నారాయణ గారి సతీమణి దొడ్డ సక్కు బాయమ్మ గారి మరణం పార్టీకి తీరని లోటు అని వారి కుటుంబ సభ్యులందరూ దొడ్డ నర్సయ్య గారితో సహా కమ్యూనిస్టు ఉద్యమ నేపథ్యం తో ముడిపడిన జీవితాలని అలాంటి వారి ఆశయాలకు అనుగుణంగా భారత కమ్యునిస్టు పార్టీ నీ ముందుకు తీసుకుపోవడానికి కృషి చేస్తానని వారు అన్నారు ఈ కార్యక్రమంలో,సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్ల వెంకట్ రెడ్డి,జాస్తి సుబ్బారావు,శ్రీనివాస్ రెడ్డి,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్,నల్గొండ జిల్లా కార్యదర్శి నెల్లికంఠి సత్యం,సూర్యాపేట జిల్లా కార్యదర్శి,పార్టీ నాయకులు సానుభూతిపరులు పాల్గొన్నారు

## ప్రజాధనం నీటి పాలు చేస్తున్న మున్సిపల్ అధికారులు..




**వేములవాడ, ఆగస్టు 29 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
వేములవాడ మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలు షోరూమ్ లకు పరిమితమైతున్ననాయి, తప్ప వార్డులలో తిరగడం లేదు. దాని పట్టించుకునే నాధుడే కరువైపోయాడు నెలలు గడుస్తున్న షోరూం లకు పరిమితమైతున్న వాహనాలు ప్రజాధనం నీటిపాలు చేస్తున్నారు వేములవాడలో చెత్త సేకరణ 30 బండ్ల ఉంటే సగానికి పైగా మూలకు పడి ఉన్న వైనం ఆ బండ్లను మెయింటెనెన్స్ చేసే నాధుడే కరువయ్యాడు, ఈ వాహనాలను మెయింటైన్ చేయడానికి ఓ వ్యక్తిని కూడా పెట్టకుండా గాలికి వదిలేసారు దీనివల్ల లక్షల విలువచేసే వాహనాలు కనుల ముందు, పాడైపోతున్నాయి అయినా అధికారులు పట్టింపు లేకుండా చూసి చూడనట్టుగా ప్రవర్తిస్తున్నారు దీనిపై వెంటనే స్పందించి చర్య తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ని కోరడం జరుగుతున్నది.

## కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎంపి




**జహీరాబాద్, ఆగష్టు 29 ( మన వార్త ప్రతినిధి టి అశోక్ కుమార్):** జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రం ఎస్వీ కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపి సురేశ్ షేట్కార్, ఎమ్మెల్యే కె మాణిక్ రావులు పాల్గొని లబ్ధిదారులకు షాది ముభారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని జహీరాబాద్, ఝరసంగం, కొహిర్, న్యాలకల్, మొగుడంపల్లి మండలా లకు చెందిన 617 మంది లబ్ధిదారులకు ఎంపి, ఎమ్మెల్యే, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, మాజీ మంత్రి ఎ చంద్రశేఖర్, తాజా, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 68 వ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం..



**జమ్మికుంట, ఆగస్టు 29( మన వార్త ప్రతినిధి):**
జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో అండర్ 14 అండర్ 17 బాల బాలికలకు మూడు రోజులుగా జరగనున్న 68 వ మండల స్థాయి క్రీడా పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. 68వ మండల స్థాయి క్రీడా పోటీలనుమున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు,జ్యోతి ప్రజ్వలన చేసి,జెండా ఎగురవేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ప్రశాంతత,శారీరక ద్రదిత్వానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. చదువుతోపాటు క్రీడలలో ప్రతిభ కనబరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రమేష్ బాబు ,మున్సిపల్ కమీషనర్ ఎం డీ అయాజ్ ,ఎం పీ డీ ఓ బీమేశ్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం,స్థానిక కౌన్సిలర్ రావికంటి రాజు ,27 వ వార్డ్ కౌన్సిలర్ గాజుల భాస్కర్ ,నాయకులు భోగం వెంకటేష్ ,మండల్ నొడల్ ఆఫీసర్ ,వివిద పాటశాలలప్రధానోపాధ్యాయులు,ఉపాద్యాయులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## కీ.శే.అంచూరి ప్రదీప్ చూపు సజీవం...



**-ఆదర్శంగా నిలిచిన కుటుంబం..**
**-అంచూరి ప్రదీప్ సంస్మరణ సభను నిర్వహించిన సదాశయ ఫౌండేషన్...**
**పరకాల,ఆగష్టు29( మన వార్త ప్రతినిధి)**
నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపు.అభినందించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు.హన్మకొండ జిల్లా పర్కాల మండలం నివాసి అంచూరి ప్రదీప్ 18.08.24 రోజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు యర్ర సుధీర్ కుమార్ సంతోష్, నేత్రదానంపై అవగాహన కల్పించగా కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నరహరి ఆధ్వర్యంలో వరంగల్ ఎల్వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఎల్వీపీ ఐ బ్యాంక్ పంపడం జరిగింది. ఈ సందర్భంగా నేత్ర దాత అంచూరి ప్రదీప్ సంస్మరణ సభను,వారి నివాసం సబ్ జైలు దగ్గర సదాశయ ఫౌండేషన్ పర్కాల కన్వీనర్ గుంటోజు వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించగా,ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ హాజరై, వచ్చిన బంధు మిత్రులకు నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన భార్య ప్రియాంక, తల్లి తండ్రులు స్వరాజ్య లక్ష్మి రాజమౌళి ,అన్నలు రాజు,దిలీప్ సోదరీమణులు తడవర్తి రమాదేవి,తోట రజిత,తడవర్తి స్వప్న ,బావలు మరియు బంధు మిత్రులకు,పిల్లలు శ్రీహాన్ ,హృదాంస్ లకు ,పర్కాల సదాశయ ఫౌండేషన్ కన్వీనర్ లయన్ బుట్టోజు వెంకన్న (ఆప్తాలమిక్ టెక్నీషియన్), సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ , కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి,యర్ర సుధీర్,జె.సి.ఐ భూపాలపల్లి అధ్యక్షులు డాక్టర్ జె.సి.రాజు,జే వి వి హన్మకొండ మండల అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్,జె.సి నాగరాజు బొడ్డు లు వారికి జ్ఞాపికను అందజేసి అభినందనలు ధన్యవాదాలు తెలిపారు.

## క్రీడా కారునికి సన్మానం



**మంచిర్యాల్ ఆగస్టు 29 (మన వార్తా ప్రతినిధి )**
ఈరోజు స్పోర్ట్స్ డే సందర్భంగా మంచిర్యాల్ జిల్లా మందమర్రి కి చెందిన గోల్డ్ మెడలిస్ట్ శేనిగరపు క్రాంతి కి శాలువా కప్పి సన్మానం చేయడం జరిగింది ఈ సందర్భంగా మాజీ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మహంత్ అర్జున్ కుమార్ మాట్లాడుతూ. నా ప్రియమైన క్రీడాకారులు మరియు మహిళలు, క్రీడా దినోత్సవం సందర్భంగా, మీలో ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని చెప్పారు. ఒక నాయకుడిగా, మన యువతను తీర్చిదిద్దడంలో, పాత్రను నిర్మించడంలో మరియు సమాజ భావాన్ని పెంపొందించడంలో క్రీడల ప్రాముఖ్యతను నేను గుర్తించాను అని అన్నారు.క్రీడల పట్ల మీ అంకితభావం, పట్టుదల, మక్కువ మా అందరికీ స్ఫూర్తిదాయకం అని చెప్పుకొచ్చారు . మీరు మన దేశ క్రీడా స్ఫూర్తికి నిజమైన అంబాసిడర్లు, మీ ప్రయాణంలో మీకు మద్దతుగా నిలిచినందుకు నేను గౌరవంగా భావిస్తున్నాను అని అన్నారు .మీరు ఈ రోజు పోటీ చేస్తున్నప్పుడు, క్రీడలంటే కేవలం గెలుపు లేదా ఓడిపోవడమే కాకుండా, మీరు నేర్చుకునే విలువల గురించి గుర్తుంచుకోండి జట్టుకృషి, క్రమశిక్షణ మరియు సరసమైన ఆట.మీరు మీ సంబంధిత క్రీడలలో రాణించటానికి నేను కూడా మీకు నా వంతు కృషిని అందిస్తాను మీ కష్టానికి తగిన ప్రతిఫలం మన ప్రాంతానికి మన దేశానికి ఉండేలాగా పోరాడండి అని మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో. సేవాదళ్ మంచిర్యాల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండి పాషా, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఓరగంటి సురేందర్, సంపత్,శేనిగరపు సాగర్, శీను, మోహన్, ప్రకాష్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**జహీరాబాద్, ఆగష్టు 29 ( మన వార్త ప్రతినిధి టి అశోక్ కుమార్):**
తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాఠశాల కమిటీ అధ్యక్షులు కల్వ చంద్రశేఖర్ హాజరయి గిడుగు రామమూర్తి పంతులు చిత్ర పటానికి పుల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష కోసం విశేష కృషిని చేసిన గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాష వైభవానికి పునాదులు వేసారని, గ్రాంథిక భాష వల్ల ప్రజలు తెలుగు భాషను నేర్చుకోలేక పోతున్నారని ఆవేదన చెంది, భాషోద్యమాన్ని చేశారన్నారు. సాధారణ జనాలకు అర్థమయ్యే వ్యావహారిక భాషలో విద్యాభ్యాసం జరగాలని చివరి వరకూ పోరాడి విజయం సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష అధ్యాపకులు విద్యార్థులకు వివిధ వక్తృత్వ పోటీలను, భాషాపరమైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొని భాషాభిమానాన్ని చాటుకున్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం..



**-చదువుతోపాటు క్రీడలలో ప్రతిభ కనబరచాలి.**
**-హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్.**
**హుజూరాబాద్, ఆగస్టు 29( మన వార్త ప్రతినిధి):**
క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని, గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులు మట్టిలో మాణిక్యాలని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు. హుజరాబాద్ మండలం లోని తుమ్మనపల్లి గ్రామంలో స్టంప్స్ బాక్స్ క్రికెట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగాకాసేపు క్రీడాకారుల తోక్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామీణ క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయించి విద్యార్థులను మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువత సైతం చెడు మార్గంలో ప్రయాణించకుండా క్రీడల పట్ల ఆసక్తిని కనపరుస్తూ ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజరాబాద్ ఏసిపి శ్రీనివాస్ జీ తో పాటు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వకృత్వ పోటీలలో జమ్మికుంట విద్యార్థినికి ద్వితీయ స్థానం..



**జమ్మికుంట, ఆగస్టు 29( మన వార్త ప్రతినిధి):**
తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాదులోని రాష్ట్రపతి నిలయంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వకృత్వ పోటీలలోహైదరాబాద్ నగరంలోని విజ్ఞాన్ స్కూల్లో విద్యానభ్యసిస్తున్న జమ్మికుంటకు చెందిన వలిపి రెడ్డి మనశ్విత ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది .గురువారం రాష్ట్రపతి భవన్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి భవన్ మేనేజర్ చేతుల మీదుగా పురస్కారాలను ప్రదానం చేశారు .బహుమతులు గెలుపొందిన విద్యార్థులను విజ్ఞాన్ విద్య సంస్థల చైర్మన్ లావు రుద్రమదేవి అభినందించారు .

## ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్ కు వినతి..



**-ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన బాధ్యత అధికారులదే.**
**-మాజీ జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్.**

**జమ్మికుంట ఆగస్టు 29( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 629, 467, 286 లో గల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారుల దే అని మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ అన్నారు. గురువారం జమ్మికుంట తహసిల్దార్ కు ప్రభుత్వ భూములు రక్షించాలంటూ వినతి పత్రం సమర్పించిన మాజీ జెడ్పిటిసి శ్యామ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో అధికారుల అండదండలతో నాయకుల సహకారంతో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయని ఆయన అన్నారు. అధికారులు సైతం కబ్జా దారు లకు అండగా నిలుస్తున్నారని ఒకప్పుడు ప్రభుత్వ భూమి ఇప్పుడు ప్రైవేటు భూమి గా ఎలా మారుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకప్పటి పెసర బండ ప్రభుత్వ భూమిని జమ్మికుంటలో పుట్టి పెరిగిన ప్రతి ఒక్కరికి తెలుసని అలాంటి భూమి నేడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కబ్జా అయిందని దానికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆయన మండిపడ్డారు. ఒక జిల్లా జడ్జి స్థాయి అధికారి అప్పుడు సర్వే చేసి ఆ స్థలం ప్రభుత్వానిది అని తేల్చి చెప్పినారు. నేడు సర్వే చేసిన డివిజన్ అధికారి ఆ స్థలం పట్టాదారి కే చెందుతుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు. ఈ విషయంపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతుందని గతంలో ఇచ్చిన అధికారి ది తప్ప లేక ఇప్పుడు సర్వే చేసిన అధికారుల తప్ప త్వరలోనే ఈ విషయంపై జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతానని ఆయన తెలిపారు. ఒకే శాఖలో పనిచేసే ఇద్దరు అధికారులు రెండు రకాలుగా సర్వే రిపోర్ట్ లు ఇవ్వడం వెనుక పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని స్థానికంగా జోరుగా చర్చ జరుగుతుంది.

## అత్యాచారం చేసిన నిందితుడికి జీవితకాల జైలు



**జహీరాబాద్, ఆగష్టు 29 (మన వార్త ప్రతినిధి టి అశోక్ కుమార్ ):** అత్యాచారం చేసిన నిందితుడిపై కేసు రుజువు కావడంతో నేరస్తుడికి జీవితకాల జైలు శిక్ష విధించినట్లు జహీరాబాద్ డిఎస్పీ కే రామ్ మోహన్ రెడ్డి పత్రికా ప్రకటన, చిరాగ్ ఎస్ఐ రాజేందర్ రెడ్డి ద్వారా విడుదల అయ్యింది. డిఎస్పీ ప్రకటన వివరాల ప్రకారం ఈ నెల 29 న పిఓసిఎస్ఓ ప్రత్యేక కోర్టు సంగారెడ్డి న్యాయమూర్తి కేసు నం. 97/2018 యు/ సెక్షన్ 376 (2) (ఐ)(ఎల్), ఐపిసి సెక్షన్ 5(ఎల్) మరియు 6 ఆఫ్ పిఓసిఎస్ఓ ఆక్ట్ చిరగ్పల్లి పోలీసు స్టేషన్ యందు వాదోపవాదనలు విన్న తరువాత న్యాయమూర్తి నేరస్తుడైన మహమ్మద్ జాబార్ తండ్రి శంశోద్దీన్ వయసు 19 సంవత్సరాలు, వృత్తి టైల్స్ పని, మన్నాపూర్ గ్రామము మొగుడంపల్లి మండలం, సంగారెడ్డి జిల్లావాసి 2018 సంవత్సరంలో ఒక మూగ మైనర్ బాలిక ను అత్యాచారం చేసిన కేసులో నేరం రుజువైనందున పిఓసిఎస్ఓ ప్రత్యేక న్యాయమూర్తి, నేరస్తునికి జీవిత కాల శిక్ష విధిస్తు, రూపాయలు 20,000/- నగదు చెల్లించ వలెనని తీర్పు ఇవ్వనైనదని తెలిపారు.

## కేశవపట్నం వాగులో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తప్పవు..



**శంకరపట్నం,ఆగస్టు 29(మానవార్త ప్రతినిధి నేరేళ్ల సంతోష్ కుమార్)**
కశవపట్నం వాగులో చికెన్, మటన్ వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో గోల్కొండ కృష్ణ ప్రసాద్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కేశవపట్నం గ్రామపంచాయతీలో చికెన్ మటన్ షాపు యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. చికెన్ మటన్ వ్యర్థాలను కేశవపట్నం వాగులో వేయడం వలన ముత్తారం రామసముద్రం చెరువు కలుషితం అవుతుందని అన్నారు. ఎటువంటి వ్యర్థాలు కూడా కేశవపట్నం వాగులో వేయవద్దని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనను ఉల్లగించినచో రూ. 10 వేల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. వ్యర్థాలను సేకరించడం కోసం ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ను షాప్ ల వద్దకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాసగోని ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి నరసయ్య, చికెన్, మటన్ షాప్ ల యజమానులు పాల్గొన్నారు.

## డీజే అధిక సౌండ్ తో ప్రజలను ఇబ్బందుల గురిచేసిన వ్యక్తిపై కేసు...




**గంభీరావుపేటఆగస్టు 29మన వార్త ప్రతినిధి** గంభీరావుపేట గ్రామంలో డీజే సౌండ్స్ పెట్టి న్యూసెన్స్ క్రియేట్ చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న రామారెడ్డి గ్రామానికి చెందిన గురిజాల చందు పై కేసు నమోదు చేసి అతని డీజే సిస్టంను మరియు అతని ట్రాలీ 1076 సీజ్ చేయడమైనదని గంభీరావుపేట ఎస్సై బి రామ్మోహన్ తెలిపినారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డీజే సౌండ్ సిస్టం ఎవరైనా పర్మిషన్ లేకుండా ఉపయోగించకూడదని ఎవరైనా డీజే సిస్టంను ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలగజేసినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపినారు.

### జడ్పీహెచ్ఎస్ పాఠశాల రామమూర్తి జయంతిని పురస్కరించుకొని

## తెలుగు భాషా దినోత్సవం..



**వేములవాడ ఆగస్టు 29 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్)**
గిడుగు రామమూర్తిజయంతిని పురస్కరించుకొని తెలుగు భాష దినోత్సవంఅంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 250 మందికి పైగా తెలుగు ప్రాచీన మరియు ఆధునిక కవుల చిత్రపటాల ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలచే పద్య పఠన పోటీలు, కవితలు మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానోపాధ్యాయులు సదానందం ఫోటో ఎగ్జిబిషన్ వల్ల విద్యార్థులు ఆయా కవులకు సంబంధించిన పరిజ్ఞానాన్ని పొందుతారని , కార్యక్రమం నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సదానందం, ప్రసాద్, శ్రీనివాస్ , రామస్వామి,మహేశ్, కవితా రాణి మరియు ఛాత్రోపాధ్యాయిని స్రవంతి విద్యార్థులు పాల్గొన్నారు.

## గద్దర్ పురస్కార అవార్డ్స్ మేధావులు,కళాకారులు పాల్గొనాలి..



**జమ్మికుంట, ఆగస్టు 29( మన వార్త ప్రతినిధి):** ప్రజా యుద్ధనౌక కామ్రేడ్ విట్టల్ రావు ( గద్దర్ ) ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆగస్టు 30న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో ప్రజా గాయకుడు గిద్దె రామ నరసయ్య ఆధ్వర్యంలో గిద్దె గళం గద్దర్ అవార్డ్స్ పేరుతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాష్ట్రంలో ఉన్నటువంటి కవులు, కళాకారులు, మేధావులకు గద్దర్ పురస్కార అవార్డులను ప్రధానం చేసి ఘనంగా సన్మానించడం జరుగుతుందని, ప్రజా ఉద్యమ సంఘాల నాయకులు,మేదావులు,కళాకారులు పాల్గోని విజయవంతం చేయాలని జమ్మికుంట కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు స్థానిక గాంధీ చౌరస్తాలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామంచ భరత్ మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో సినిమా ఇండస్ట్రీలో ఇచ్చినటువంటి నంది అవార్డ్స్ కు బదులుగా గద్దర్ పురస్కార అవార్డును ఇస్తామని సంచలన ప్రకటన చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సినీ పరిశ్రమలో గద్దర్ పురస్కార అవార్డును వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ఈ అవార్డు మహోత్సవానికి తెలంగాణ నలుమూలల నుండి కవులు కళాకారులు రచయితలు మేధావులు ప్రజా సంఘాల ఉద్యమ నాయకులకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, తెలంగాణ హమాలీ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ సామ్రాజ్యం, ప్రముఖ చిత్రకారుడు డప్పు వరల్డ్ గిన్నిస్ రికార్డు అవార్డు గ్రహీత అంబాల ప్రభు, మహిపాల్ యాదవ్ ప్రముఖ గాయకులు రొంటాల మొగిలి, ప్రముఖ డప్పు వాయిద్య కరుడు జీడి సుధాకర్, శీను, రేపు మోహన్ , ఈదునూరు లక్ష్మణ్ డాక్టర్ తిరుపతి, పోతారపు అశోక్ అంబాల కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రప్రభుత్వం వెంటనే బీసీ గణన చేపట్టాలి..



**-స్పష్టమైన హామీ ఇచ్చి నిరాహారదీక్ష విరమింపజేయాలి**
**-దీక్ష చేస్తున్న నాయకులకు ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత**
**-ఉద్యమకారుడు:రాసమల్ల శ్రీనివాస్...**

**శంకరపట్నం ఆగస్టు 29(మన వార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో మూడోసారి జరిగిన శాసనసభ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో జరిగిన బహిరంగసభలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ పై ఇచ్చిన హామీకి కట్టుబడి 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు రాసమల్ల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో 2023 జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ 42 శాతం అధికారంలోకి వస్తే అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము 9 నెలలు గడుస్తున్న బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా,బీసీల హక్కుల సాధనకై ఉద్యమిస్తున్న బీసీ సంఘం నాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ ఘనన చేపట్టాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ సంఘం నాయకులు జక్కని సంజయ్ కుమార్, బత్తుల సిద్దేశ్వర్ ల గురించి ప్రభుత్వం స్పందించకపోవడం బాదాకరం అన్నారు. దీక్ష చేస్తున్న నాయకులకు ఏదైనా అయితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు తలతోక లేని ప్రకటనలు చేస్తూ జనాన్ని అయోమయానికి గురి చేస్తున్నారనీ,ఒకవైపు ఎన్నికల ప్రక్రియ కోసం అధికారులు ఓటర్ జాబితాను సిద్ధం చేస్తుంటే మరోవైపు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిసి గణన చేపడతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీసీ గణన చేపట్టి రాబోయే స్థానిక ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించిన తర్వాతనే ఎన్నికల ప్రక్రియ మొదలెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఆమరణ నిరాహార దీక్షలో ఉన్న నాయకులకు స్పష్టమైన హామినిచ్చి దీక్ష విరమింపజేయాలని కోరారు. నిరాహారదీక్ష చేపట్టే నాయకులకు ఎలాంటి హాని జరిగినా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని శ్రీనివాస్ హెచ్చరించారు.

## కాసాని ని పరామర్శించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కోణంనేని




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 29 ( మన వార్తా ప్రతినిధి )** కొత్తగూడెం సిపిఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య తీవ్ర అనారోగ్యంతో ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాసాని ఐలయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఐలయ్యను పరామర్శించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఎం నాయకులు కె. నర్సయ్య తదితరులు ఉన్నారు.

## గుండ్లసింగారంలో ఘనంగా తీజ్ నవరాత్రి ఉత్సవాలు



**హసన్ పర్తి ఆగస్టు29(మనవార్తప్రతినిధి కోడెపాకశ్రీకాంత్):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ గుండ్లసింగారం బాలాజీ బంజారా కాలనిలోని సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రాంగణంలో తీజ్ నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి తీజ్ కమిటీ అధ్యక్షుడు, 2డివిజన్ కార్పొరేటర్ లావుడ్య రవినాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మహబూబాబాద్ మాజీ ఎంపి సీతారాం నాయక్,మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్,జవహర్ లాల్ నాయక్,మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పన,పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి లావుడ్య రాజు నాయక్,రాకేష్ రెడ్డి,కమిటీ సభ్యులు,అధిక సంఖ్యలో బంజారా ప్రజలు పాల్గొన్నారు.

## ఠాగూర్ సినిమా సీన్ తలపించేలా ఎన్ ఎస్ ఆర్ నిర్వాహకం




**హసన్ పర్తి ఆగస్టు29(మనవార్తప్రతినిధి కోడెపాకశ్రీకాంత్):** కాలుకు ఫ్రాక్చర్ అవ్వడంతో 3వ డివిజన్ ఆరెపల్లి ఎన్ఎస్ఆర్ హాస్పిటల్లో ముచర్ల గ్రామానికి చెందిన హరి ప్రసాద్ అనే పేషంట్ ని అడ్మిట్ చేసిన తరువాత సర్జరీ ఫెయిల్ అవ్వడంతో అదే కాలుకి మరలా సర్జరీ చేయడం వల్ల ఆ సర్జరి కూడ ఫెయిల్ అవ్వడం వల్లే చనిపోయాడాని బంధువుల ఆరోపిస్తున్నారుచనిపోయిన విషయం కూడా డాక్టర్లు తమకు చెప్పకుండా ఠాగూర్ మూవీ సీన్ క్రియేట్ చేసినట్టు బాధితులు ఆరోపిస్తున్నారుఎన్ ఎస్ ఆర్ హాస్పిటల్లో మెరుగైన వైద్యం కోసం వెళ్తే ప్రాణాలు పోయాయని రోధిస్తున్నటువంటి మృతిని కుటుంబ సభ్యులు ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ డాక్టర్లు,యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని రోదిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు ముందస్తు గొడవలు అవుతాయని పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేసుకున్న హాస్పిటల్ యాజమాన్యం ఉన్నతాధికారులు ఇటువంటి హాస్పిటల్ లపై ఓ నజరానా వేసినట్లయితే ముందు ముందుగా ఇటువంటి పరిస్థితులు పురాణావృతం కాకుండా ఉంటాయని బాధితులు ఆరోపిస్తున్నారు.